
వయసు మీరిన
తల్లితండ్రుల
అవసరాన్ని
ఆ పిల్లలు
గుర్తించారా!

# బెడ్‌రూం




"అప్పుడే తొమ్మిదైంది. ఇక మీరు వెళ్ళి పడుకోండమ్మా". డైనింగ్ టేబుల్ మీదున్న గిన్నెలు సర్దుతూ కోడళ్ళ నుద్దేశించి అన్నారు లక్ష్మిగారు.

పర్లేదులెండి అత్తయ్యగారూ! అయిపోవచ్చిందిగా అంటు ఎంగిలి కంచాలు, గ్లాసులు తీసికెళ్ళి వంట గదిలోని సింకులో వేస్తున్న భవ్యతో.

అది కాదక్కా! మనం త్వరగా మన బెడ్‌రూమ్స్‌లోకి వెళ్తే తర్వాత అత్తయ్యగారికి అడ్డుండదు కదా! అదీ అత్తయ్యగారి తొందరకి కారణం...

ఏయ్ నీకు రోజు రోజుకి అల్లరి మరీ ఎక్కువవుతుంది. చిన్నా పెద్దా లేకుండా అత్తయ్య గారిని ఎంత మాట పడితే అంతమాట అనేయటమేనా...

ఊరుకో భావ్యా! దివ్య మాత్రం ఇప్పుడేమన్నదని అలా కోప్పడుతున్నావ్. అత్త గారంటే ఓ దెయ్యాన్నో, భూతాన్నో చూసినట్లు భయపడకుండా ఇలా సరదాగా కలిసిపోయి ఉండటమే నాకిష్టం అని 'చూడవమ్మా చిన్న కోడలా! ఈ వయసులో తొందర ఎవరికి ఉంటుందో నాకామాత్రం తెలుసు కాని త్వరగా వెళ్ళమ్మా. అవతల మావాడు ఎదురు చూస్తున్నట్లున్నాడు" అన్నారు నవ్వుతూ.

'పోండత్తయ్యా' అంటూ దివ్య వెళ్ళి గబగబా హాల్లో అత్తగారికి, మామగారికి రెండు మంచాలు వేసి పరుపులు, దుప్పట్లు పరిచి నీట్‌గా పక్కలు సర్దింది. ఈలోగా భవ్య మంచినీళ్ళ చెంబు, గ్లాసు తెచ్చి మామగారి మంచం పక్కగా నున్న



టీపాయ్ మీద పెట్టింది.

భవ్య, దివ్య తమ గదుల్లోకి వెళ్లటం చూపి కూడా హాల్లో కూర్చుని వక్కపొడి నములుత్తూ తండ్రితో కబుర్లు చెబుతున్న కొడుకుల్ని ఉద్దేశించి "ఇంకా కబుర్లేంటిరా. వెళ్ళి పడుకోండి" అన్నారు ముద్దుగా కసిరినట్లు.

తల్లి ఆ మాట ఎప్పుడంటుందా అని

ఎదురు చూస్తున్న వాళ్ళలా లేచి "గుడ్‌నైట్ అమ్మా! గుడ్‌నైట్ నాన్నగారు!" అంటూ ఎవరో తరుము కొస్తున్నట్లుగా హడావుడిగా ఎవరి గదుల్లోకి వాళ్ళు దూరి తలుపులేసుకున్నారు.

"పిచ్చి సన్నాసులు..." కొడుకుల్ని చూసి ముచ్చటగా నవ్వుకున్నారు.

ట్యూబ్‌లైట్ ఆఫ్ చేసి బెడ్‌లైట్ వేసి తన మంచం మీద పడుకొంటున్న భార్యని చూసి "ఏమిటోయ్! నీలో నువ్వే నవ్వుకొంటున్నావు?" నవ్వుతూ అడిగారు రావుగారు.

ఏం లేదండి. మన పిల్లల్ని చూస్తుంటే నవ్వొచ్చింది కాని మనం కావాలని అక్కచెల్లెళ్ళనే మనింటి కోడళ్ళుగా తెచ్చుకొని మంచిపని చేశామనిపిస్తుందండి. వీళ్ళ నలుగురి మధ్య ఈ ప్రేమలు, అప్యాయతలు ఎప్పటికి ఇలాగే ఉండి పోవాలని ఆ దేవుణ్ణి కోరుకుంటున్నాను.

వాళ్ళ నలుగురి మధ్యేకాని ప్రేమలు ఆప్యాయతలు మనిద్దరి మధ్య వద్దా...? చిలిపిగా అడిగారు.

మీ చిన్నకోడలు కూడా మీకు సరిపోయిందే దొరికింది. మీ ఇద్దరికి సరసాలాట్టానికి నేనే దొరికానా... లేని కోపం అభినయించారు.

ఏమంటుందేమిటి...?

దొడ్లో పూసిన విరజాజులన్నీ కోసి మాలకట్టి పెట్టుకోండమ్మా అంటే ఉండండత్తయ్యా! మొత్తం మాకేనా ఏమిటి...? మామయ్యగారికో... అంటుంది.

"అదేమిటే. మీ మావయ్యగారు పూలు పెట్టుకుంటారా ఏమిటి...?" అంటే అది కాదత్తయ్యా. పెట్టుకొనేది మీరే అయినా మామయ్యగారి కోసమేగా అని చిలిపిగా నవ్వుతుంది.

నిన్నటికి నిన్న...

అత్తయ్యగారూ! మీకు పదమూడేళ్ళకే పెళ్ళైందంటున్నారే. ఫస్ట్‌నైట్ మీరు ఎలా ఫీలయ్యారు. భయపడ్డారా... లేక సరదాగా ఎంజాయ్ చేశారా? అని అడిగింది.

చిన్నగా గుసగుసగా చెబుతున్న భార్య మాటలు వింటు ముసిముసిగా నవ్వుకున్నారు.

"ఇంతకీ చిన్న కోడలికి ఏం సమాధానం చెప్పావోయ్..." మీసం మెలేస్తు చిలిపిగా అడిగారు.

"పోండి. మీరు కూడాను..."

నలభయ్యో ఏట అడిగిడినా పదహారేళ్ళ కన్యలా అందంగా సిగ్గు పడుతున్న భార్యని ముచ్చటగా చూస్తూ 'రారాదటోయ్ ' అన్నారు భార్యవైపు చెయ్యి చాస్తూ.

కోడళ్ళు వచ్చినా మీ అల్లరి తగ్గకపోతే ఎట్లా. ఇంకో ఏడాదిపోతే తాతగారు కూడా అవుతారు. ఇక మీ కోరికలకి కళ్ళాలు వేయాలి మరి.

కోడళ్ళు వచ్చి మనవళ్ళు పుట్టినంత మాత్రాన ముసలాళ్ళమై పోతామటోయ్ ఇప్పుడు మన వయసెంతని...? నువ్వు నలభైలో పడితే నాకు మొన్ననేగా నలభై అయిదు వచ్చింది. అసలు నలభై దాటాకే యవ్వనం తిరగబెడుతుందంటారు. ఇప్పుడేనోయ్ అసలు సరదాగా గడపాల్సింది.

ఇలాంటి కబుర్లకేం... ఎన్నైనా

చెబుతార్లే. అవతల పిల్లలు చూశారంటే నవ్విపోతారు.

వాళ్ళు లేస్తే కదే. వాళ్ళ లోకంలో వాళ్ళున్నార్లే. ఇప్పుడు నువ్వు పిలిచినా రారు కాని రావోయ్ కాస్త... వచ్చి ఎన్నాళ్ళైంది చెప్పు... లాలనగా అన్నారు.

భర్త మాటలకి కరిగిపోయారామె. "నిజమే. పిల్లల పెళ్ళిళ్ళ హడావుడిలో పడి ఆయన్నసలు పట్టించుకున్నదే లేదు" అనుకొంటూ మెల్లగా భర్త మంచం మీదకి జరిగింది.

"పిల్లల పెళ్ళిళ్ళు చేసినా నాకు మాత్రం మన పెళ్ళి నిన్నో మొన్నో అయినట్లుంది లక్ష్మీ!" భార్య ముంగురులు సవరిస్తు ప్రేమగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నారు.

పెళ్ళై ఇన్నేళ్ళైనా భర్తతో ఇంకా తొలినాటి అనురాగాన్నే చూస్తున్న లక్ష్మి "తనెంత అదృష్టవంతురాలో" అనుకొంటు భర్త గుండెల్లో ఒదిగిపోయింది.


సరిగ్గా రెండు నెలల తర్వాత కలిసిన మొదటి కలయిక. తనువులు, మనసులు దగ్గరయ్యేసరికి వారికి తెలియకుండానే వెచ్చటి కోరిక రగిలింది. ఎంతో ఆవేశంతో ఒకరినొకరు హత్తుకొని అతల్లా పెనవేసుకుపోయారు.

సరిగ్గా అదే సమయంలో...

పెద్ద కొడుకు రాజేష్ భళ్ళున తలుపు తెరుచుకొని హాల్లోకి అడుగుపెట్టబోయి, బెడ్‌లైట్ వెలుగులో తల్లిదండ్రుల్ని చూడరాని స్థితిలో చూసి వెంటనే తలుపులు దఢాలున శబ్దం వచ్చేలా గడేసుకోవటం జరిగిపోయింది.

కొడుకుని చూడగానే ఆవేశం చల్లారిపోయి గబుక్కున భర్తని పక్కకి నెట్టేసి అస్తవ్యస్తంగా ఉన్న చీరని గుండెల మీద కప్పుకొంటు అదిరే గుండెలతో తన మంచం మీదకి చేరింది ఆవిడ.

పెద్ద కొడుకు అలా వస్తాడని ఊహించని రావుగారు కూడా ఓ క్షణం బిత్తరపోయారు.



'ఛీ...ఛీ... వద్దన్నకొద్దీ విన్నారు కారు. రేపు నీ ముఖం వాడికెలా చూపించవండీ. వాడి ముందు నేనెలా తిరిగేది...?'' ఏడుపు గొంతుతో చిన్నగా అంటున్న భార్యని ''వూరుకో లక్ష్మీ! వాడలా వస్తాడని మనమే మైనా కలగన్నామా...? ఐనా ఇప్పుడు మనమేం తప్పుచేశామని ఇంతలా బాధపడు తున్నావు. భార్యాభర్తలన్నాక ఇది సహజమే కదా. మామూలుగా ఉండటానికి ప్రయ త్నించు. వాడా మాత్రం అర్థం చేసుకోలే డా ఏమిటి...'' అంటు రాత్రి చాలా పొద్దుపోయేవరకు ఓదారుస్తూనే ఉన్నారు.

భర్త ఎంత నచ్చచెప్పాలని చూసినా లక్ష్మి మనసు మనసులో లేదు.

పెద్ద కొడుకు తనగురించి నీచంగా అనుకుంటాడేమోననే వూహతో ఏ తెల్లవా రు ఝామునో నిద్రపోయింది.

అందరికంటే ముందుగానే నిద్రలేచి తలార స్నానం చేసి వంటగదిలో కెళ్ళింది.

చిన్నకొడుకు సురేష్ ఎప్పటిలాగే నిద్ర లేవగానే హాల్లో పేపరు చదువుతున్న తండ్రి కి 'గుడ్ మార్నింగ్' చెప్పి వంట గదిలోని తల్లి దగ్గరికి వచ్చి ''గుడ్ మార్నింగ్ అమ్మా! టిఫినేంటి ఈరోజు...?'' అన్నాడు.

'రవ్వ దోసె...' పొడిగా జవాబిచ్చారు.

'రవ్వ దోసే... ఐతే ఇప్పుడే వస్తామండ మ్మా...!' అంటూ బాత్‌రూంలో దూరా డు.

రాజేష్ ఇంకా రాడేం...? నిద్ర లేవలేదా ఏం...? ఎప్పుడూ ఇంతసేపు పడుకోడే...? లేవగానే అలవాటు ప్రకారం గుడ్‌మార్నింగ్ చెప్పాల్సొస్తుందని తమమొహాలు చూడటం ఇష్టంలేక అలానే పడుకున్నాడా ఏం.''

మనసు పరిపరి విధాలుగా పోతుంది.

తన ఆలోచనల్లో ఉండి స్టౌవైపు తిరిగి దోసెలు పోస్తూ రాజేష్ తన వెనకనుండే బాత్‌రూంలోకి వెళ్ళటం, స్నానం చేసి తిరిగి బెడ్‌రూంలోకి వెళ్ళటం గమనించలేదామె.

దోసెలు తీసికెళ్ళటానికి వచ్చిన భవ్యని చూసి ''రాజేష్ లేచాడామ్మా'' అన్నారు.

''ఆ. స్నానం కూడా చేశారు. ఏదో పనుందట త్వరగా టిఫిన్ చేసి బయటికెళ్ళా లంటున్నారు'' అంటూ అత్తగారు వేస్తున్న దోసెల్ని ప్లేట్లో సర్దుకుంది.

నిజంగానే పనుందేమోనని మనసు సరి పెట్టుకోవాలని చూసినా ఎంత అర్జెంటైతే మాత్రం తల్లిని, తండ్రిని పలకరించే తీరిక కూడా లేదా అని ఏ మూలో చిన్న బాధ... మళ్ళీ అంతలోనే ''పోన్లే... సాయంత్రం వస్తాడుగా...'' అని సరిపెట్టుకున్నారు.

కానీ... అదీ అడియాసే అయింది.

రోజా ఆఫీస్ నుండి రాగానే వంట గదిలో చేరి వేడివేడిగా తనేమైనా చేసి పెడుతుంటే తింటూ ఆఫీస్ కబుర్లు చెప్పి నవ్విస్తుండేవాడు కాస్తా ఆ రోజు రావటంతో నే బెడ్‌రూంలోకి వెళ్ళి 'భవ్యా! టిఫిన్ ప్లేటూ'' అన్నాడు.

ఇలా ఒకరోజు రెండ్రోజులు కాదు. వరుసగా నాలుగు రోజులు గడిచాయి.

వాడికి నన్ను చూస్తుంటేనే అసహ్యమే స్తుందేమో ననుకొంటు రాజేష్ ఉన్నంతసే పు కంటికి కనిపించకుండా ఏదో పనున్నదాని లా పెరట్లోనే గడపసాగారు. భర్తతో కూడా అంటీ ముట్టనట్లుగా ఉంటు తనతొందర

పాటుకి తనలోనే తిట్టుకొంటు మనసులోనే కుమిలిపోసాగారు.

ఏదో రోజు రాత్రి...

కొడుకులిద్దరు తమ గదుల్లోకి వెళ్ళారని నిర్ధారించుకున్నాక నెమ్మదిగా పెరట్లోనుండి వచ్చి "వ్రాలోజుల్నుండి వరండాలో పడుకొంటున్న భర్తనొ ఓసారి చూపి నెమ్మదిగా తలుపులు గడివేశారు. బెడ్‌లైట్ వేసి ట్యూబ్‌లైట్ ఆఫ్ చేయబోతూ పెద్దకోడలు చిన్నగానైనా కొంచెం ఆవేశంగా మాట్లాడటం వినిపించి ఆగిపోయారు.

"ఏమిటండీ! ఏమిటసలు మీ ఉద్దేశం...?" మీ ప్రవర్తనతో అత్తయ్యగారిని, మామయ్యగారిని ఎంత బాధపెడుతున్నారో ఒక్కసారైనా ఆలోచించారా? అసలు వాళ్ళు చేసిన తప్పేంటండి...?"

"ఛీ... ఛీ... తలుచుకుంటేనే అసహ్యమేస్తుంది. ఇంత వయసొచ్చినా ఇంకా సిగ్గులేకుండా... అదీ కొడుకులు, కోడళ్ళు పక్కగదుల్లో కాపురంచేస్తుంటే వాళ్ళు సిగ్గులేకుండా కొత్త దంపతుల్లా ప్రవర్తిస్తుంటే..." ఛి... ఛి... తలుచుకొంటుంటే నాకే సిగ్గేస్తుంది.

"ఏమిటండీ! అంత సిగ్గుపడాల్సినంత తప్పుడు పని వాళ్ళేం చేశారు? నిన్న మొన్నటి వరకు వాళ్ళ దాంపత్య జీవితానికి తీపి గుర్తైన ఈ బెడ్‌రూంని మనకివ్వటమా వాళ్ళు చేసిన తప్పు...? వాళ్ళు ప్రేమగా దగ్గర్నుండి కట్టించుకున్న సొంత ఇంట్లోనే కొడుకుల సుఖం కోరి పరాయివాళ్ళలా బయటపడుకొంటున్నారే అదేనా వాళ్ళు చేసిన తప్పు...

సిగ్గులేకుండా కొత్త దంపతుల్లా ప్రవర్తిస్తున్నారంటున్నారే... దేనికి సిగ్గు పడాలండి వాళ్ళు...? అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకొని పాతికేళ్ళ నుండి కాపురం చేస్తున్న భార్యాభర్తలే కాని పరాయివాళ్ళు కాదుగా...

"అది కాదు భావ్యా! ఇంత వయసు వచ్చినా ఇప్పుడు కూడా..." కోపంగా అంటూ భవ్యమాటలకి అడ్డురాబోయాడు.



## కర్టెను

"ఏమండీ ఆ ఎదురింటి మేడమీది కుర్రాడు మన కిటికీలోనుంచి అస్తమానం నన్ను చూస్తుంటాడు కిటికీలకు కర్టెన్లు కట్టండి" అన్నది ఆండాళమ్మ భర్తతో.

"ఇన్నోసారి వాడిని పూర్తిగా చూడనీ, వెంటనే వాడే కర్టెన్లు కట్టుకుంటాడు వాడి గుమ్మాలకీ, కిటికీలకీ" చెప్పాడు భర్త ఆలోచనారావు కూల్‌గా

– శ్రీకొండ
(ఎర్రబోడు)

"చాల్లే పూరుకోండి. ఎంత చెప్పినా మళ్ళీ అదే మాటా...? ఎంత వయసని... నిండా యాభై ఏళ్ళు లేని మీ అమ్మా నాన్న మీ కళ్ళకి ముసలాళ్ళలా కనిపిస్తున్నారాండీ...! నిన్న మొన్నటివరకు వాళ్ళిద్దరు ఒకే బెడ్‌రూంలో పడుకొంటున్నా ఏమి అనిపించని మీకు ఈ రోజు మీకు పెళ్ళి కాగానే ఇంత సడన్‌గా వాళ్ళ వయసు గుర్తొచ్చిందాండీ...? ఐనా... మనిషికింత వయసు వచ్చాక దాంపత్య సుఖం అనుభవించకూడదని ఎక్కడా ఏ గ్రంథాల్లోను రాసిపెట్టి లేదండి. ఇంత చిన్న విషయానికి మీరెందుకింత రాద్ధాంతం చేస్తున్నారో అర్థం కావటం లేదండి.

మీ ప్రవర్తనకి అత్తయ్యగారెంతగా కుమిలిపోతున్నారో మీకేం తెలుసు? మామయ్యగారైతే తన మంచం బయటవేసుకొని పడుకొంటున్నారు. వాళ్ళ బెడ్‌రూంలో పడుకొంటు, అన్ని సుఖాలు అనుభవిస్తూ వాళ్ళని మాత్రం ఒకరికొకరు కాకుండా బయట పడుకొనేలా చేశారు... పైగా వాళ్ళంటే అసహ్యం. హు బావుందండి మీ వరస" అంటు ఓసారి భర్తవైపు చూసింది.

రాజేష్ ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపించేసరికి "చూడండి! నేనేదో ఆవేశంతో అన్నానని కోపగించుకోక కొంచెం ఆలోచించండి. నిన్న మీకు జరిగిన అనుభవం రేపు మీ తమ్ముడికో, నాకో, నా చెల్లెలికో ఎదురుకావచ్చు. అలా జరగకుండా ఉండాలంటే ముందు మీ అమ్మగారికి, నాన్నగారికి ఓ బెడ్‌రూం ఏర్పాటు చేసే ప్రయత్నం చేయండి. లేదంటే చెప్పండి నేను కూడా అత్తయ్యగారితో పాటే పడుకొంటాను".

భార్యమాటలకి సిగ్గుపడిపోయాడు రాజేష్.

"నిజంగా నేను నీలా ఇంతదూరం ఆలోచించలేదు భావ్యా. ఏదో ఆరోజు బాత్‌రూంకి వెళ్ళాల్సి వచ్చి తలుపుతీయగానే వాళ్ళనా స్థితిలో చూసి నిజంగానే అసహ్యించుకున్నాను. నీ మాటలు విన్నాక తెలిసింది నేనెంత పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నానోనని. నువ్వన్నట్లు నిజంగా వాళ్ళకి బెడ్‌రూం లేకపోబట్టేగా ఈ గొడవ జరిగింది. రేపు ఆఫీస్‌కి సెలవు పెట్టి అయినా సరే అర్జెంటుగా చెక్కలతో హాల్లో పార్టిషన్ ఏర్పాటు చేయిస్తా. తర్వాత నిదానంగా ఎటాచ్‌డ్ బాత్‌రూంతో సహా బెడ్‌రూం కట్టే ప్లాన్ చేయాలి.

బెడ్‌రూం ప్లాను తర్వాత వేద్దురుకాని ముందు వెళ్ళి మామయ్య గారిని లోపల పడుకోమని చెప్పి రండి అంటున్న భావ్య మాటలు విని గబగబా వెళ్ళి తన మంచం మీద పడుకొని నిద్ర నటించింది ఆవిడ!

"బెడ్‌రూం సంగతి దేవుడెరుగు. ముందు మా వాడి కళ్ళు తెరిపించావ్. చిన్న దానివైనా నీకు చేతులెత్తి దణ్ణం పెట్టాలమ్మా భావ్యా!" అనుకొంటుంటే అప్రయత్నంగా కళ్ళ వెంట రెండు కన్నీటి బొట్లు రాలాయి...

ఇంతలో హఠాత్తుగా చిన్నకోడలైన దివ్య చలిపి మాటలు గుర్తొచ్చాయి.

"అత్తయ్యగారూ! మామయ్యగారు బయట పడుకొంటున్నారెందుకు...? హాలిడేసా...? లేక అలక సీన్నా...?" అని మూడు రోజుల్నుండి కొంటెగా అడుగుతున్న దివ్య గుర్తురాగానే "ఉండు. రేపు కాని నీ పని చెప్పనే చిన్నకోడలా..." అనుకొని హాయిగా తనలోతాను నవ్వుకున్నారామె! ★